# బహిష్కారం

— విన్నకోట సుశీలాదేవి

“అన్నయ్యా! ఇక నేనా ఇంటికెళ్ళి ఆయనతో కాపరం చేయలేనన్నయ్యా!''

మంచం మీద పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న చెల్లెలు సుమతిని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు రమణమూర్తికి!

తల్లీ-తండ్రీ చనిపోతే ఒక్కగానొక్క చెల్లెల్ని ఎంతో గారాబంగా పెంచాడు. చెల్లెలు డిగ్రీ పాసయ్యాక తలకు మించి భారమైనా కోరిన కట్నం ఇచ్చి, కాలేజీ లెక్చరర్‌తో పెళ్ళి చేశాడు.

చెల్లెలు సుఖంగా వుంటే చాలని అప్పుచేసి కూడా ఆమె కోరినవి కొనిపెట్టాడు.

కానీ తన దురదృష్టమేమోగానీ — తను ఇచ్చే కొద్దీవాళ్ళ దాహం ఎక్కువై పోతూంది. తీర్చేకొద్దీ వాళ్ళ కోరికలు ఎక్కువై పోసాగాయి.

తనేమీ లక్షాధికారి కాడు. మధ్యతరగతి కుటుంబీకుడు. తన భార్యా పిల్లల అవసరాలు కూడా గమనించుకోవాలి కదా. తను చేసే గుమస్తా వుద్యోగంలో తన కుటుంబం గడవడమే కష్టంగా వుంది. అదీకాక సుమతికి పెళ్ళికి అప్పుగా తెచ్చిన కట్నం డబ్బునీ ఇంకా పూర్తిగా తీర్చలేదు. ఇక ఈ గొంతెమ్మ కోర్కెల్ని ఎలా తీర్చగలడు?

పెళ్ళయినప్పటినుండీ—తరచూ ఏదో ఒక కొత్తకోరిక పుట్టుకురావడం, సుమతిని పుట్టింటికి తరమడం ఆమె భర్తకి అలవాటయిపోయింది.

ఆర్నెల్లక్రితం కలర్ టి.వి. అడిగాడు. ఆ కోరిక వినగానే తన గుండె చల్లబడ్డట్లయింది. కలర్ టి.వి. అంటే పదివేలు కావాలి. బ్యాంకులో పది రూపాయలు కూడా లేవు. అంత డబ్బు ఎక్కడినుండి తేగలడు?

వీలైనంత త్వరలో ఇస్తానని.... చెల్లెలికి మాటిచ్చి — మభ్యపెట్టి పంపించాడు. కానీ ఇంత వరకూ కొని పెట్టలేకపోయాడు.


ఏదో ఒక రోజు చెల్లెలు మళ్ళీ టి.వి. కోసం వస్తుందని భయపడుతూనే వున్నాడు. అలాగే జరిగింది.

హఠాత్తుగా పొద్దున్నే హైద్రాబాద్ నుండి వూడిపడింది సుమతి!

వచ్చినప్పటినుండీ ఏడవడం తప్ప ఏం మాట్లాడటం లేదు. చెల్లెలి ఏడ్పు చూస్తోంటే రమణమూర్తికి గుండె తరుక్కుపోతోంది. తన చేతకానితనానికి సిగ్గుపడుతున్నాడు.

“సుమతీ! నీకు టి.వి కొనిపెట్టాలని ఈ ఆరు నెల్లనుండీ చాలా ప్రయత్నాలు చేస్తూనే వున్నానమ్మా'' దీనంగా అన్నాడు.

సుమతి తలెత్తి అన్నగారి వేపు చూస్తూ.... “అన్నయ్యా! ఇప్పుడు టి.వి కోసం కాదు వచ్చింది. అంతకంటే పెద్ద సమస్య వచ్చింది'' అంది బాధగా.



అవినీతిని ప్రతిఘటించి, దుష్ట శక్తులను శిక్షించి, సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పవలసిన బాధ్యత ప్రభుత్వానిది. కానీ ఆ యంత్రాంగం లోప భూయిష్టంగా వున్నప్పుడు, అన్యాయానికి గురవుతున్న వనితల సంఖ్య రోజురోజుకూ అధికమవుతూ వున్నప్పుడు, ఈనాటి యువతరం ఏం చేయాలి? ‘మనకెందుకులే’ అని నిరాశా నిస్పృహలతో వూరుకోవాలా? సాంఘిక బాధ్యత గల పౌరుల్లా-క్లిష్ట సమయాల్లో చైతన్యమూర్తులై తమ శక్తి యుక్తులు చూపి, అవినీతిపరుల కళ్ళు తెరిపించాలా?

రమణమూర్తి భయపడుతూ—

"ఏమిటమ్మా అది?" అనడిగాడు.

"మా మరిదికి ఇటీవలే పెళ్ళి ఖాయమైంది. యాభై వేల కట్నం, పదికాసుల బంగారం ఇస్తామన్నారు వాళ్ళు. మనం ఈయనకు ఇచ్చింది పదిహేను వేలే కదా. తన తమ్ముడికిచ్చినంత డబ్బూ మనం కూడా ఈయనకివ్వాలిట. తీసుకు రమ్మని పంపారు."

రమణమూర్తికి నోటమాట రాలేదు. చాలా సేపటివరకూ ఆ షాక్ నుండి తేరుకోలేక పోయాడు.

"చాలా వింతగా వుందే. అప్పుడా కట్నానికి ఇష్టపడే పెళ్ళి చేసుకున్నారుగా."

"అవును చేసుకున్నారు. కానీ ఇప్పుడు ఇంకా ఎక్కువ డబ్బు వస్తోంటే చేదా?"

"ఎవరిస్తున్నారు?"

"ఇంకెవరు? నువ్వే ఇవ్వాలి. లేకపోతే నేను పుట్టింట్లో శాశ్వతంగా వుండిపోవాలి. నేను విడాకులిస్తే ఎక్కువ కట్నంతో మరో పెళ్ళి చేసుకుంటారుట. లేకపోతే వుండిగా చివరి ఆయుధం....చావు ...హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తారు."

సుమతి కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలాయి.

రమణమూర్తి వెర్రిగా చూస్తూ వుండిపోయాడు.

పవిత్రమైన వివాహం ఎంత భయంకరంగా మారిపోయింది. ఆడపిల్లకు పెళ్ళి చేయాలంటేనే భయమేస్తోంది. మనుషులెందుకింత రాక్షసంగా తయారయ్యారు? డబ్బు తప్ప ఇంకో దృష్టి లేదా? ప్రేమ, అభిమానం, మానవత్వం అనేవి మచ్చుకి కూడా ఎవ్వరిలోనూ కనబడటం లేదు. అంతా స్వార్థం....రాక్షసత్వం...ఏమైపోతుందీ జాతి?

ఆ వేదనగా అనుకున్నాడు.

"సుమతీ! నువ్వేం దిగులుపడకమ్మా. నేనేదో పరిష్కారం ఆలోచిస్తాగా ...త్వరలోనే అన్నీ చక్కబడతాయి. నువ్వు ఏడుస్తూంటే నేను చూడలేను. నువ్వు మామూలుగా వుండమ్మా," అన్నాడు ఆమె తలపై చెయ్యి వేసి ఓదారుస్తూ.

*

రమణమూర్తి చెల్లెలికైతే ధైర్యం చెప్పాడు కానీ, ఈ సమస్యనెలా పరిష్కరించాలో అతనికి అర్థం కాలేదు. చెల్లెలి కాపరం ఏమైపోతుందో నన్న దిగులుతో అతడు రోజురోజుకీ క్రుంగిపోసాగాడు.

"ఏమిట్రా మూర్తీ అలా అయిపోతున్నావ్! ఒంట్లో బాగుండటంలేదా" రమణమూర్తి, స్నేహితుడు రాజారావు పలకరించాడు.

"బాగానేవుంది" పొడిగా అన్నాడు,

"మరేమిటలావున్నావ్! ఏదైనా సమస్యా!"

స్నేహితుడితో తన సమస్య గురించి చెప్పుకోవాలన్పించింది మూర్తికి. వాడేదైనా సలహా ఇస్తాడేమో? అనుకుంటూ సుమతి గురించి చెప్పాడు.

రమణమూర్తి వూహించినట్లు రాజారావు ఆశ్చర్యపోలేదు. చాలా మామూలుగా విన్నాడు.

"రాజా! అతనింత దుర్మార్గుడనుకోలేదు. చదువుకున్నాడు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు కానీ సంస్కారం బొత్తిగా లేని పశువు."

"మూర్తీ, ఆవేశపడకు....మనుషులందరూ సంస్కారవంతులైతే ఈ ప్రపంచం ఏనాడో స్వర్గతుల్యమైపోయేది!"

"కానీ మనుషుల్లో మానవత్వంకంటే రాక్షసత్వమే ఎక్కువైపోతోంది. ఏ రోజు పేపరు చూసినా ఒకటో - రెండో కట్నం చావులు కనబడుతూనే వున్నాయి. ఈ హత్యల్ని ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదు. ఏ న్యాయస్థానమూ హంతకులకు తగిన శిక్ష విధించడం లేదు. నేరాలు తగ్గాలంటే శిక్ష కఠినంగా వుండాలి. నన్నడిగితే చనిపోయిన అమ్మాయి తాలూకు అత్తింటివారినందరినీ వురి తీయాలి. అప్పుడే ఈ కట్నం బాధలు తగ్గుతాయి!" ఆవేదనగా అన్నాడు మూర్తి.

"నువ్వు చెప్పింది బాగానేవుంది కానీ అదిప్పట్లో జరిగేది కాదు. కాబట్టి ప్రస్తుతం మనకున్న పరిధిలో ఈ సమస్యల్ని పరిష్కరించుకోడానికి ప్రయత్నించాలి" అన్నాడు రాజారావు.

"ఇప్పుడు మా సుమతి సమస్యని ఎలా పరిష్కరిస్తావ్? అది చెప్పు."

రాజారావు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. "మూర్తీ! నువ్వు దిగులుపడకు. నేనేదో ఒక వుపాయం ఆలోచిస్తాను. మీ చెల్లెలు ఏ అఘాయిత్యం చేయకుండా నువ్వు మాత్రం ఆమెని జాగ్రత్తగా చూస్తూండు."

"సుమతి ఒట్టి అమాయకురాలు. మనసులో ఎంత బాధవున్నా నేను దిగులుపడతానేమోనని తన బాధని మనసులోనే అణచుకుంటోంది పాపం."

మూర్తి హృదయం చెల్లెలిపై జాలితో నిండిపోయింది.

"మూర్తీ! సుమతి భర్త పేరేమిటి" రాజారావు అడిగాడు.

"శ్రీధర్!"

"అతనెక్కడ పని చేసేది?"

"హైద్రాబాద్‌లో కాలేజీ లెక్చరర్!"

"అడ్రసు ఇవ్వగలవా?"

మూర్తి అడ్రసు రాసిచ్చాడు.

"ఎందుకు?" అనడిగాడు రమణమూర్తి.

"తర్వాత చెప్తాలే" మూర్తి ఇచ్చిన కాగితాన్ని జేబులో పెట్టుకున్నాడు రాజారావు.

"ఇక నువ్వు నిశ్చింతగా వుండు మూర్తీ!" అంటూ మూర్తికి ధైర్యం చెప్పాడు రాజారావు.

*

"విద్యార్థుల ఐక్యత వర్ధిల్లాలి."

"లెక్చరర్ శ్రీధర్ డౌన్ డౌన్."

కాలేజీ క్యాంపస్ విద్యార్థుల అరుపులతో హోరెత్తిపోతోంది.

ఆ కేకలు గుండె దడదడలాడించగా ప్రిన్సిపాల్ మేడపైన తన గదిలో ఆందోళనగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

నెలవులనంతరం కాలేజీ తెరిచిన ఈ ఆరు నెలల్లోనూ కుర్రాళ్ళు సమ్మె చేయడం ఇది ఆరోసారి.

కాలేజీ తెరవగానే ఫీజు లెక్కువగా వున్నాయని, ఆ తర్వాత పుస్తకాలకోసం, రిజర్వేషన్ల కోసం ఇలా నెలకొకటి చొప్పున స్ట్రైక్ చేస్తూనే వున్నారు.

కానీ ఇప్పుడే కారణంచేత చేస్తున్నారో అర్థం కావడంలేదాయనకు.

ఉదయం పది గంటలకు తను కాలేజీ క్యాంపస్‌లో అడుగుపెట్టగానే కాలేజి అంతా ఎందుకో చాలా కోలాహలంగా వున్నట్లు కనబడింది.ఆయన్ని చూస్తూనే కుర్రాళ్ళు అరవడం మొదలెట్టారు.

"లెక్చరర్ శ్రీధర్ డౌన్ డౌన్."

ఆ కేకలు వింటూ ఆయన ఆశ్చర్యపోయాడు.

శ్రీధర్ ఏ నేరం చేశాడో అర్థంకాలేదు. శ్రీధర్ ఈ కాలేజీలో లెక్చరర్‌గా చేరి అయిదేళ్ళయింది. కొద్దికాలంలోనే సమర్థుడైన లెక్చరర్‌గా పేరు తెచ్చుకున్నాడు. అతడేనాడూ తనకు సమస్య కాలేదు.

మరివ్వాళ ఏమయిందో?

ప్యూనుని పిలిచి అడుగుదామనుకునేంతలో డోర్ తెరుచుకుని స్టూడెంట్స్ యూనియన్ సభ్యులు లోపలికొచ్చారు.

"గుడ్ మార్నింగ్ సార్" అన్నాడు ప్రెసిడెంటు.

"ఏమిటోయ్ ఈ గొడవ?"

"ఇది చదవండి సార్! మీకే తెలుస్తుంది!" అంటూ ఒక కాగితం అందించాడు.

ప్రిన్సిపాల్ చదువుకున్నాడు.

"శ్రీధర్‌గారిని పిలిపించి మాట్లాడండి సార్" అన్నాడు సెక్రెటరీ!

"అలాగే"

ప్యూను చేత శ్రీధర్‌ని పిలిపించాడు.

శ్రీధర్ వచ్చాడు.

"కూర్చోవయ్యా!"

శ్రీధర్ కూర్చున్నాక అతనివేపు చూస్తూ, "శ్రీధర్! కుర్రాళ్ళు స్ట్రైక్ ఎందుకు చేస్తున్నారో తెలుసా?" అనడిగాడు ప్రిన్సిపాల్.

"తెలియదు సార్" అన్నాడు శ్రీధర్.

అతనికి చాలా ఆశ్చర్యంగా వుంది! కుర్రాళ్ళందరూ ఇలా తన మీద ధ్వజమెత్తడానికి కారణమేమిటో తెలీక అతడూ కంగారు పడుతున్నాడు.

"చూడు శ్రీధర్! నువ్వు నీ భార్యని పుట్టింటికి పంపావా?" సూటిగా అడిగాడు ప్రిన్సిపాల్.

అనుకోని ఆ ప్రశ్నకు తెల్లబోయాడు.

"ఏమిటి సార్ మీరు అనేది?"

"నువ్వు నీ భార్యని పుట్టింటికి పంపావా? లేదా? సూటిగా సమాధానం చెప్పు!" గంభీరంగా అడిగాడాయన.

"పంపించాను."

"ఎందుకు?"

చెప్పడానికి సంకోచించాడు శ్రీధర్.

"కట్నం డబ్బు కోసమేనా?" ప్రిన్సిపాల్ అన్నాడు.

శ్రీధర్ విస్తుపోయాడు.

"మీకెలా తెలుసు సార్" ఎదురు ప్రశ్న వేశాడు.

"అయితే వీళ్ళు చెప్పేది నిజమేనన్నమాట!"

శ్రీధర్ ఆశ్చర్యంతో తలమునకలవుతున్నాడు. అసలు విషయం కుర్రాళ్ళకెలా తెలిసిందా అనే సందేహం .... తెలిసిపోయిందనే సంకోచం .... అతన్ని తలొంచుకునేలా చేశాయి.

"శ్రీధర్! నలుగురికీ న్యాయం ధర్మం చెప్పాల్సిన ఉపాధ్యాయుడివి. నువ్వే నీతి తప్పితే ఎలా? అంతేకాదు నువ్వు బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నవాడివి! కట్నం తీసుకోవడం నేరమని తెలీదా? తీసుకున్నది చాలక ఇంకా తెమ్మని ఆమెని పీడించడమా! నువ్వసలు మనిషివేనా!" ప్రిన్సిపాల్ తీవ్రంగా అడిగాడు. శ్రీధర్‌కి అవమానం కలిగింది. కుర్రాళ్ళ ముందు ఆయనలా మాట్లాడటం సహించలేకపోయాడు.

"సార్! అది నా వ్యక్తిగత విషయం" కొంచెం రోషంగా అన్నాడు.

"నీ వ్యక్తిగత విషయం కాదు మిస్టర్! ఇది మా అందరికీ సంబంధించింది. నువ్వు ఒంటరిగా అడవిలో కాపరం వుండటం లేదు! సంఘంలో పదిమంది మధ్యా వున్నావు. అంతేకాదు. ప్రభుత్వం క్రింద పనిచేస్తున్న సేవకుడివి! నీ విషయం....అందరికీ కావాలి! అంతేకాదు! దాదాపు వేయిమంది కాలేజీ విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడివి! నిన్నెంతోమంది గమనిస్తుంటారు! నువ్వు చేసే ప్రతి పనినీ – వేసే ప్రతి అడుగునీ వేల కళ్ళు చూస్తుంటాయి! నేరం చేసి తప్పించుకుందామంటే కుదరదు.... తెలుసా మిస్టర్" ఆవేశంగా అన్నాడాయన.

శ్రీధర్ మాట్లాడలేకపోయాడు.

యూనియన్ కుర్రాళ్లు కల్పించుకున్నారు.

"మాష్టారూ! మా అందరికీ ఆదర్శంగా వుండి మేం తప్పుచేస్తే సరిదిద్దాల్సిన మీరే ఇలా ప్రవర్తించడం ఏం బాగా లేదండీ! మీరు వెంటనే వెళ్లి సిస్టర్‌ని తీసుకురండి సార్" హిత బోధ చేశారు.

శ్రీధర్ తలెత్తుకోలేకపోయాడు.

"అంతేకాదు మాష్టారూ! ఇంకెప్పుడూ ఆమెను ఏ విధంగానూ బాధపెట్టనని మాకు రాసివ్వాలి" అంటూ పట్టుబట్టారు.

## నీ పేరు....

తొలి సంజె కిరణాన
పులకించు పువ్వుకొన
తొణికేటి ముత్యాన
మెరిసింది నీ పేరు

తల్లి ఎద గుడిలోన
దోబూచు లాడేటి
పసిపాప నవ్వులో
తడిసింది నీ పేరు

కన్నె కన్నుల కొసల
కరగేటి కలలలో
కళకళల తళతళల
కదలింది నీ పేరు

మల్లె పూదోటలో
మెల్లగా వీచేటి
పరిమళపు వుయ్యాల
వూగింది నీ పేరు

గొంతులో కదలాడి
పెదవి బయటికిరాని
రసరమ్య భావనల
కావ్యమే నీ పేరు

— ఉమాదేవి

శ్రీధర్ తప్పించుకోలేకపోయాడు.

వాళ్ళు చెప్పినట్లుగానే చేశాడు.

ప్రిన్సిపాల్ కుర్రాళ్ళను అభినందించాడు.

"ఇంతవరకూ కుర్రాళ్ళు అల్లరి పనులే చేస్తారనుకున్నానోయ్! మీరింత మంచి పనులు కూడా చేస్తారని ఇప్పుడే తెలిసింది! మిమ్మల్ని మనస్ఫూర్తిగా మెచ్చుకుంటున్నాను. పదేళ్ళ క్రితం నా కూతురు కూడా వరకట్నానికి బలైపోయింది. ఆనాడు మీలాంటి కుర్రాళ్ళుండి – నా అల్లుడికి బుద్ధి చెప్తే నా కూతురు బ్రతికేదయ్యా" అంటూ కళ్ళు తుడుచుకున్నాడాయన.

"సార్! నన్ను క్షమించండి. నేను చేసింది పొరపాటే" శ్రీధర్ పశ్చాత్తాపపడసాగాడు.

"క్షమాపణ మాకు కాదు చెప్పాల్సింది! నీ భార్యకు."

"అలాగే సార్...."

*

శ్రీధర్ దగ్గరనుండి వచ్చిన ఉత్తరం చూడగానే సుమతి ఆనందం పట్టలేకపోయింది. రమణమూర్తి అయితే ఆశ్చర్యం నుండి చాలాసేపటి వరకూ తేరుకోలేకపోయాడు.

ఈ అద్భుతం ఎలా జరిగింది?

శ్రీధర్‌లో ఈ మార్పు ఎలా వచ్చింది?

ఆలోచిస్తున్న మూర్తికి రాజారావు గుర్తొచ్చాడు.

'అతడే ఏదో' చేసి వుంటాడు.

ఆఫీసుకెళ్ళి రాజారావుకి శుభవార్త చెప్పి ఏం జరిగిందో తెలుసుకునేవరకూ ఆరాటం ఆపుకోలేకపోయాడు.

రాజారావు నవ్వుతూ, కుర్రాళ్ళు చేసిన పని చెప్పాడు. చెప్పి –"మూర్తీ! ఏ మార్పయినా యువతరమే తీసుకురావాలి. యువత పూనుకుంటే తప్ప, ఈ సంఘంలోని చెడు తొలగిపోదు." అన్నారు.

"ఈ స్వార్థపరులైన పెద్దలు అడ్డుతగలకుండా వుంటేకదా."

"ఏదైతే ఏం....ముందు నీ సమస్య పరిష్కారమైంది. ఇక నిశ్చింతగా వుండు."

"అంతా నీ చలవే....నీకు కృతజ్ఞతలెలా చెప్పాలో..." నవ్వుతూ అన్నాడు మూర్తిని.

"నాకు కాదు చెప్పాల్సింది, ఆ విద్యార్థులకు."

"అవునవును. సుమతిని తీసుకెళ్ళినప్పుడు వాళ్ళని కలుసుకుని కృతజ్ఞతలు తెలియచేయాలి."

ఏ తీవ్ర పరిణామాల్ని ఎదుర్కోవాలో అని భయపడుతున్న రమణమూర్తి-సమస్య ఇంత తేలిగ్గా పరిష్కారమవడంతో హాయిగా నిట్టూర్చాడు. □